ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్, 2024 | 5 | శ్రీకాకుళం

మోడల్ స్కూల్ ప్రవేశాలకు హాల్ టిక్కెట్లు జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

2024-25 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని ఎపి ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు హాల్ టిక్కెట్లను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు అన్ని మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో ఆరోజు ఉదయం పది నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లు https://cse.ap.gov.in లేదా https://apms.apcfss.in/Student Login.do వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో రాయవచ్చని తెలిపారు.

- శ్రీకాకుళం గొండు శంకర్, పాతపట్నంకు మామిడి గోవిందరావు ఫిక్స్!
- తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్న గుండ, కలమట కుటుంబాలు
- ఎంపీ ప్రచారానికి దూరంగా శ్రీకాకుళం టిడిపి కేడర్

జిల్లాలో అసెంబ్లీ అభ్యర్థిత్వాల విషయంలో ఎటువంటి మార్పులు చేయకూడదని తెలుగుదేశం పార్టీ అధిష్టానం భావించినట్లు తెలుస్తోంది. జిల్లాకు సంబంధించి గత నెల 22వ తేదీన ప్రకటించిన మూడో జాబితాలో శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి గొండు శంకర్, పాతపట్నం నియోజకవర్గానికి మామిడి గోవిందరావు, పలాస స్థానానికి గౌతు శిరీషను అభ్యర్థులుగా ఖరారు చేసిన విషయం తెలిసిందే. వీరినే అభ్యర్థులుగా కొనసాగించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో గుండ, కలమట కుటుంబాలు భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. పాతపట్నంలో ఈనెల 13న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించి మరోసారి కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలని కలమట నిర్ణయించారు. శ్రీకాకుళంలో ఈనెల 13 లేదా 14న కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఒక నిర్ణయం తీసుకోవాలని గుండ కుటుంబం భావిస్తున్నట్లు తెలిసింది.

మార్పు లేనట్టే...

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పాతపట్నంలో కలమట వెంకటరమణకు టిడిపి అధిష్టానం టిక్కెట్లు నిరాకరించడంతో పార్టీ శ్రేణులు కోపోద్రిక్తులయ్యారు. టిక్కెట్ల ప్రకటన తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమావేశాలకు భారీగా కార్యకర్తలు తరలివచ్చి మద్దతు పలికారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ఒత్తిడి చేశారు. కొందరు నాయకులు ఒకడుగు ముందుకేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పోటీ కోసం విరాళాలు సైతం ప్రకటించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి ఇక్కడి పరిస్థితులు చేరడంతో హైదరాబాద్‌కు పిలిపించుకుని మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు చెప్పిన విషయాలను జాగ్రత్తగా విని నాలుగైదు రోజుల్లో ఏదో విషయం చెప్తానని, అప్పటివరకు ఎటువంటి కార్యక్రమాలు చేయొద్దని ఇరువురికి హామీనిచ్చారు.

గొండు శంకర్ | గుండ లక్ష్మీదేవి | మామిడి గోవిందరావు | కలమట వెంకటరమణ

పార్టీ నిర్ణయం కోసం కొద్దిరోజులుగా వారు నిరీక్షిస్తూనే ఉన్నారు. పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ ఈనెల తొమ్మిదో తేదీన ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో చంద్రబాబును కలిశారు. రెండు రోజులు గడిచినా ఇప్పటికీ ప్రకటన రాలేదు. శ్రీకాకుళం, పాతపట్నం అభ్యర్థిత్వాల విషయంలో పార్టీ తన నిర్ణయం మార్చుకునే పరిస్థితి కనిపించకపోవడంతో ఇన్‌ఛార్జీలు భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మరోసారి కార్యకర్తలతో సమావేశం

అభ్యర్థుల మార్పు ఉండబోదన్న సమాచారంతో గుండ, కలమట కుటుంబాలు మరోసారి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. మూడో జాబితా ప్రకటన తర్వాత కార్యకర్తలతో ఒకసారి సమావేశమై అభిప్రాయాలను తీసుకున్న సంగతి తెలిసిందే. పాతపట్నంలో ఈనెల 13న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోవాలని కలమట వెంకటరమణ నిర్ణయించారు. పాతపట్నం స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. పార్టీ బి-ఫారం ఇస్తే టిడిపి అభ్యర్థిగా, లేకుంటే స్వతంత్ర అభ్యర్థిగా కొనసాగాలని యోచిస్తున్నట్లు సమాచారం. శ్రీకాకుళం నియోజకవర్గంలో ఈనెల 13న గానీ 14న గానీ మరోసారి కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని గుండ కుటుంబం నిర్ణయించినట్లు తెలిసింది.

ఎంపీ ప్రచారానికి దూరంగా గుండ అనుచరులు

శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఏడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రచారం మొదలుపెట్టారు. శ్రీకాకుళం, పాతపట్నం మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం సాగించారు. అభ్యర్థుల మార్పు సమాచారంతో శ్రీకాకుళం, పాతపట్నం ప్రాంతాల్లో ప్రచారం చేయలేదు. గురువారం మాత్రం ఆయన శ్రీకాకుళం నగరంలో ప్రచారం చేశారు. అభ్యర్థుల మార్పు ఉండదన్న సమాచారం ఎంపీకి ఉండొచ్చని గుండ అనుచరులు భావిస్తున్నారు. మరోవైపు రామ్మోహన్ నాయుడు ప్రచారానికి శ్రీకాకుళం నగర కేడర్ దూరంగా ఉంది. స్వయంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు పిలిచినా రాలేదని తెలిసింది.

ఇన్‌ఛార్జీల వెంట నిలిచేదెవరో?

టిడిపి మూడో జాబితా ప్రకటన తర్వాత శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. తమ నేతలకు పార్టీ టిక్కెట్ నిరాకరించడంపై రగిలిపోయారు. ఆ తర్వాత రెండు చోట్లా నిర్వహించిన ఆత్మీయ సమావేశాలకు నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని, సమావేశంలో అక్కడికక్కడే నిర్ణయం చెప్పాలని ఒత్తిడి చేశారు. కొంతమంది నాయకులు వేచి చూద్దామని చెప్పినా అంగీకరించలేదు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని చెప్తూ కొంతమంది నాయకులు విరాళాలు సైతం ప్రకటించారు. టిక్కెట్లు ప్రకటించి సుమారు 20 రోజులు కావస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల్లో ఆ వేడి ఇప్పుడు ఉంటుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది. మరోవైపు శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు జోరుగా ప్రచారం సాగించడం మొదలుపెట్టారు. టిక్కెట్లు రాని నేతల కేడర్ క్రమేణా అటువైపు వెళ్లొచ్చని అధిష్టానం అంచనా వేసినట్లుగా కనిపిస్తోంది. కేడర్ ఆగ్రహాన్ని చల్లార్చడానికే చంద్రబాబు కొద్దిరోజులు నిర్ణయం వాయిదా వేశారనే చర్చ పార్టీలో సాగుతోంది. అభ్యర్థిత్వాల మార్పు విషయంలో హామీనిచ్చి చివరకు మొండిచేయి చూపడం ద్వారా చంద్రబాబు తమ నేతలను మరోసారి మోసం చేశారని వారు మండిపడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

లౌకికవాద ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపు

ప్రజాశక్తి - సోంపేట

మతోన్మాద బిజెపితో జత కట్టిన టిడిపి, జనసేన కూటమిని... నిరంకుశ వైసిపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభలో సిపిఎం, వామపక్షాల బలాన్ని పెంచి కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వం ఏర్పడేలా చూడాలని పిలుపునిచ్చారు. వామపక్ష శక్తుల ప్రత్యామ్నాయమే ఈ దేశానికి రక్షణ అని అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ నియంతృత్వ బిజెపి ప్రభుత్వం దశాబ్దకాలంగా సాగించిన పాలనతో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి మూల స్తంభాలుగా భావించే లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఆర్థికసార్వభౌమత్వం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయ వ్యవస్థలను పద్ధతి ప్రకారం బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం దేశంలో కార్మిక హక్కులను కాలరాసేందుకు నిరంకుశ పద్ధతులను అవలంభిస్తోందన్నారు. తద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అత్యంత అసమానతలు కలిగిన సమాజాల్లో ఒకటిగా మారుస్తోందని విమర్శించారు. మరోవైపు ప్రజలను మతపరంగా విభజించేందుకు విషపూరితమైన మతోన్మాద సిద్ధాంతాలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకోవడం... బిజెపి తొత్తుగా వైసిపి వ్యవహరించడం ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, మండల కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, జుత్తు సింహాచలం, కె.సింహాచలం, రామారావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్న మహిళలు

పోర్టు పనులకు నీళ్లు అమ్ముకుంటున్నారు

పంచాయతీ కార్యాలయం వద్ద యామాలపేట గ్రాస్తుల ఆందోళన

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం యామాలపేటలో తాగునీటి కష్టాలతో మహిళలు, యువకులు గురువారం నిరసనకు దిగారు. యామాలపేటలోని పలు వ్యవసాయ మోటారు పంపుల ద్వారా ప్రైవేట్ వ్యక్తులు మూలపేట పోర్టు పనులకు నీళ్లు అమ్మకోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్ ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి గ్రామంలో ఎక్కడపడితే అక్కడ బోర్లు తవ్వకాలు చేపట్టారని తద్వారా పోర్టు పనులకు, ప్రైవేటు కార్యక్రమాలకు అధిక మొత్తంలో నీటిని అమ్ముకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గ్రామంలో తాగునీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకుకు నీరు సరిగ్గా అందడం లేదన్నారు. దీంతో రెండు మూడు రోజులు తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గ్రామంలోని ఇళ్లల్లో బోర్లకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని సక్రమంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించక పోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కేశవరావు స్పందిస్తూ గ్రామస్తుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు తీసుకుని ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈనెల 12న గ్రామసభ నిర్వహించి, ఆయా బోర్ల యజమానులతో మాట్లాడి నీటి అక్రమ తరలింపు చర్యలను నిలుపుదల చేస్తామన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నాం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని కనిందిపల్లి, గేదెలవానిపేటలో గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలను తీసుకొచ్చామన్నారు. గ్రామాల రూపురేఖలు మార్చేందుకు, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో అనూహ్య మార్పులు తీసుకొచ్చి వాటిని క్షేత్రస్థాయిలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. పాలనా సంబంధ సంస్కరణలు ఇప్పుడిప్పుడే సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. వీటిని ప్రజలు అర్థం చేసుకుని, వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారం ఇవ్వాలని కోరారు. ఒక్క మాట అయినా నిలబెట్టుకున్న చరిత్ర చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. రుణమాఫీ చేస్తానని మహిళా సంఘాలు, రైతులను నిలువునా ముంచారని విమర్శించారు. నాడు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. రాజధాని పేరుతో దోపిడీకి తెరలేపి, స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ఇందుకు భిన్నంగా వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందన్నారు. వాలంటీరు వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజల గుమ్మాల వద్దకే తీసుకొచ్చిందని తెలిపారు. సినీనటుడు పవన్ కళ్యాణ్, చంద్రబాబు పక్క రాష్ట్రంలో ఉంటూ ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల తర్వాత వీళ్లెవరూ ప్రజలకు దొరకరని చెప్పారు. వైసిపి నాయకులు సాధు కామేశ్వరరావు, సాధు మురళి, పసగాడ అప్పలరాజు, గుజ్జల కృష్ణ, అల్లాడ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానం

ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ

ఎచ్చెర్ల: విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం అవసరమని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో ఈనెల 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న టెక్ని వెర్స్ ఫెస్ట్‌ను గురువారం ప్రారంభించారు. తొలుత 3డి ప్రింటింగ్ మెకానికల్, ఇఇఇ ఇవి, ఇసిఇకి సంబంధించిన విఎల్‌ఎస్‌ఐ బ్రాంచ్ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరంలోని పలు కళాశాలల విద్యార్థులతో టెక్ని వెర్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫెస్ట్‌లో ఇవి వెహికల్స్, డ్రోన్ సర్వేయింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఫోన్ ఫార్జ్, టెక్ అరేనా, టెక్ ఫేట్, వెబ్ డిజైన్ తోన్, కన్సలే హాక్, కాగానితో కోడ్, అన్వేషక, మైండ్ టెంటాకల్స్, ఎలక్ట్రిక్కింగ్, సర్క్యూరిటీరి, స్పార్క్ యువర్ బ్రెయిన్, డిజైన్ డేర్బైతో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ, చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ఆమదాలవలస : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో శతశాతం ఓటుహక్కు వినియోగంపై అంతర్జాలంలో గ్రామీణ స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొని అవగాహన పొందుతున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు పూర్తయిన ప్రతి పౌరులు ఖచ్చితంగా ఓటుహక్కును పొందాలని, మే 13న జరగబోవు ఎన్నికల్లో స్వచ్ఛందంగా పాల్గొని ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. గురువారం కొరపాం, నిమ్మ తొర్లాడ, బెల్లమామ్, గోపి నగర్, చింతలపేట తదితర గ్రామ సంఘాల పరిధిలో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు.

పూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న డిఆర్ఒ గణపతిరావు

పూలే ఆశయసాధనకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమ సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, అదే మహాత్మా జ్యోతిరావు పూలేకు ఇచ్చే ఘన నివాళి అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. పూలే 198వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని అన్నారు. బహుజన సామాజిక విప్లవోద్యమ పితామహుడని కొనియాడారు. అణగారిన, బలహీన వర్గాల వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి గ్రామాల్లో పూలే వినూత్న కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. పూలే కన్న కలలను సాకారం చేసేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు అరికట్టడానికి కీలక పాత్ర వహించారన్నారు. మహిళలకు సమాజంలో విద్య అవసరమని గుర్తించిన మహోన్నత వ్యక్తి అని, అటువంటి మహనీయుల అడుగుజాడల్లో అందరూ నడవలన్నారు. బిసి సంక్షేమ అధికారి ఇ.అనురాధ పూలే జీవిత చరిత్రలో కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.చిన్నారావు, పలు శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈద్‌ముబారక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల్లో మత గురువులు ఖురాన్ పఠనం, సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్తూ పరస్పరం ఆత్మీయతతో కూడిన ఆలింగనం చేసుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని చారిత్రక జామియా మసీదులో వందల సంఖ్యలో ముస్లిములు నమాజ్ చేశారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జామియా మసీదులో ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు ముస్లిములు చేపట్టిన ఉపవాస దీక్ష ముగిసింది. ప్రార్థనలతో మసీదులన్నీ కళకళలాడాయి. ఉదయాన్నే మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు రంజాన్ విశేషాలను వివరించారు. అందరూ కలిసి సహపంక్తిలో ఫలహారాన్ని స్వీకరించారు. ముస్లిములే కాక ముస్లిమేతర సోదరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లాలోని ఇతర మసీదుల్లోనూ రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జామియా మసీదుకు వెళ్లి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

నమాజ్ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

టిడిపి కండువా వేస్తున్న రవికుమార్

వైసిపికి షాక్

తోలాపిలో 150 కుటుంబాలు టిడిపిలో చేరిక

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసిపికి భారీ షాక్ తగిలింది. వైసిపికి పట్టు ఉన్న తోలాపిలో అంతర్గతవర్గ విభేదాలతో ఓ తరగతి మొత్తం టిడిపి జిల్లా అధ్యక్షులు, ఆముదాలవలస నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఒక తరగతిలోని 150 కుటుంబాలు గంపగుత్తుగా టిడిపి కండువా గురువారం రాత్రి కప్పుకున్నాయి. టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎంపిటిసి మాజీ సభ్యులు పప్పల అప్పలనాయుడు. పొన్నాడ అప్పన్న, పొన్నాడ గంగాధర్, పొన్నాడ సత్యం, ఉపసర్పంచ్ పప్పల శ్రీను, మొదలవలస వల్లయ్య, పొన్నాడ నాగజ్యోన ఆధ్వర్యాన సుమారు 400 మంది చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నాడ రామారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కూన వెంకట సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, ఎ.రాము, వండాన మురళి, బి.శంకరబాస్కర్, సీపాన శ్రీరంగనాయకులు, బాడాన గిరి, ఎంపిటిసి సరస్వతి పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడి అంగవైకల్యం కలిగిన వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ తెలిపారు. స్థానిక కళ్యాణ మండపంలో ఎన్నికల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఎన్నికల అధికారులు గ్రామాల్లో పర్యటించి 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులను గుర్తించి వాళ్ల నుంచి 12-డి ఫారం తీసుకోవాలన్నారు. 85 ఏళ్లు నిండినట్లు, 40 శాతం అంగవైకల్యం కలిగిననట్లు వారి నుంచి ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచే యాలని ఆదే శించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించి నా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.వి.వి.ఎస్ నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

సబ్ రిజిస్ట్రార్‌పై ఉల్లంఘన కేసు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ తవిటయ్య ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినట్లు కేసు నమోదైంది. తవిటయ్య గత నెల 26వ తేదీన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన నివాసంలో కలిశారు. ఆ సమయంలో వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు చెందిన పలువురు యువకులు మంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు. సబ్ రిజిస్ట్రార్ మంత్రిని ఆయన నివాసంలో కలిసినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సబ్ రిజిస్ట్రార్ ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. ఆ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. ఆ నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
S.O.P. 3/2024

Between:-
Manikonda Ramachandra Rao ---Petitioner
And:-
Nil ---Respondent

జనరల్ నోటీస్

పై నెంబరు కేసులో మణికొండ జయలక్ష్మి మరణించినందున ఆమె తాలుక వారసులు వారికి రావలసిన Shares and Debentures కొరకు పై కోర్టులో Succession Certficate కోసం దాఖలు చేయడమైనది. ఇంది విషయమై **తేది 15-04-2024 దీన పై కోర్టులో వాయిదా యున్నది.** సదరు వాజ్యంపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలుగాని, objection గాని ఉన్న యెడల పై తేదీ నాడు పై కోర్టుకు ఉ॥ 10.30నిలను మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి వారి తాలుకా objection తెలియజేయవలసినదిగా కోరడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

బరాటం నాగేశ్వరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం.

కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి- కొత్తూరు

కోట్లాది మందికి అన్నం పెట్టే ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి కూలీల కడుపుకొడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం పిలుపునిచ్చారు. మండలంలోని మెట్టూరు బిట్, ఇరపాడు గ్రామాల్లోని పనిప్రదేశాల్లో ఉపాధి కూలీలతో గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 కూలి చెల్లించాలని, రెండు పూటల పనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం... ఉపాధి కూలీలకు మాత్రం బడ్జెట్లో కోత విధించడం దుర్మార్గమని అన్నారు. అందరికీ పనులు కల్పించాలంటే పెద్ద పెద్ద చెరువుల్లో పనులు చేయించాలన్నారు. అలాగే బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దాసరికి మంగన్న వి.దశమి, ఆడివరపు శ్రీరాములు, పిన్నింటి శేషగిరిరావు, గొట్ట గణపతిరావు, మీసాల మోహనరావు, మురుజేటి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గాంధీ

ఒక్క అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలను కోరారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని 22వ వార్డు వెంకయ్యపేటలో, మండలంలోని గాజుల కొల్లివలస, శ్రీహరిపురం, ఆర్అర్ కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో, మండల పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే స్వాగతం పలుకుతున్నాయన్నారు. వేదికలెక్కి ఉపన్యాసాలు ఇచ్చే నాయకులకు ప్రజా సమస్యలు కంటికి కనపడడం లేదా అని ప్రశ్నించారు. నిద్దరపోతున్న అధికార పక్షం సభ్యుడిని ప్రశ్నించే ప్రతిపక్షం నియోజకవర్గంలో లేకుండా పోయిందని ఎద్దేవా చేసారు. కార్యక్రమంలో గురుగుబెల్లి రాజశేఖర్, సూర్యానారాయణ, ఈశ్వర్, గురుగుబెల్లి చంద్ర, వెంకటరమణ, సాయి, సనపల రాజు, ఆనంద్, నారాయణ పాల్గొన్నారు.

జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఘనంగా ఆక్షి-2కె24 వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన కంప్యూటర్ ఇంటర్నల్ ఫెస్ట్ ఆక్షి 2024 వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిధిగా జిఎమ్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ విభాగాధిపతి ప్రొఫెసర్ డా ఎ.వి.రమణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్ వంటి అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివ శంకర్‌లు కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సు, ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, రామ్‌కుమార్, ఎస్.హరి మానస, లలిత రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, కె.వేణు, ఎం.నరేష్‌కుమార్, ఎన్.పవన్ కుమార్, రేణుక, గౌరి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సిఐ జి.దివాకర్ వాయునందన్ యాదవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రావికంటిపేటలో గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి వివాదాలకు వెళ్లకూడదన్నారు. యువత వివాదాలకు కొని తెచ్చుకోవడం వలన పోలీస్ కేసుల్లో ఇరుక్కొని తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎస్ఐ వెంకటేష్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎన్నికలు దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఓటు వేసుకోవాలని పాతపట్నం సిఐ నల్లి సాయి కోరారు. చీపురుపల్లిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, ఎఎస్ఐలు నర్సింగరావు, అప్పన్న, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస : పోస్టర్లను పంపిణీ చేస్తూ ఓటును అభ్యర్థిస్తున్న సీతారాం

సంతబొమ్మాళి : కొల్లిపాడులో ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

పలాస : ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కవిటి : ప్రచారం చేస్తున్న పిరియా విజయ

ఆమదాలవలస: ఎన్‌డిఎ కూటమి నేతలు ఇస్తున్న అమలు కాని హామీలను ప్రజలు నమ్మరని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పట్టణంలోని మెట్టక్కివలసలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైసిపిని ఆదరించాలని ప్రజలను కోరారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జన రంజక పాలనను అందించిన వైసిపికి పట్టం కట్టడానికే ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నేరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అజంతా కుమారి, అత్తులూరి రవికాంత్, ముత్తా విజయ్, మరాఠీ వెంకటేష్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్, దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.

పలాస: తాను ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన సమయంలో పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరోమారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 9,10,11,12 వార్డుల్లో గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ రైల్వే వంతెన పూర్తి చేయకుండా గత పాలకులు ఎన్నో ఏళ్లగా విడిచి పెడితే... తాను ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో రైల్వే వంతెన నిర్వాసితులకు న్యాయం చేశానని అన్నారు. ప్రస్తుతం రైల్వే వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డు విస్తరణ పనులు పూర్తి ప్రజలకు అంకితం చేశామన్నారు. తాను ఇచ్చిన హామీలో రైతుబజార్ ఏర్పాటు చేయలేకపోయానని, తాను మరలా ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రైతుబజార్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. తనకు ఎమ్మెల్యే, ఎంపీ పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, దుర్గా శంకర్ పండా, పోతనపల్లి ఉమాకుమారి, శార్వాణి గీత, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, రొక్కెం హైమావతి, పోతనపల్లి హరి, బోర చంద్రకళ, సనపల సింహాచలం పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని పెద్దసీది, తామర, తీమర పంచాయతీల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్, ఎఎంసి చైర్మన్ కొండల అర్జునరావు, సచివాలయాల కన్వీనర్ సూర్యం పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని కొల్లిపాడు పంచాయతీలో కొల్లిపాడు, గంటపేట, సీపురం, సుగ్గువానిపేట, సిమ్మయ్యపేట గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపి ప్రతినిధిలు నక్క భీమారావు, పొందల రామకృష్ణ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కోత సతీష్, కొల్లిపాడు సర్పంచ్ ప్రతినిధి గొరుసు సవరయ్య, ఎంపిటిసి ప్రతినిధి బొంగు కొండయ్య, రమణ, చాట్ల నూకయ్య పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కవిటిలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతికి మద్దతుగా ఆమె తనయుడు రెడ్డి శ్రావణ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వాకింగ్ చేస్తున్న వారిని, పలువురు వ్యాపారులను, టీ దుకాణం వద్దకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, శశి భూషణరావు, రాజశేఖరరెడ్డి, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఇచ్ఛాపురం : పోస్టర్‌ను అందజేస్తున్న అశోక్

రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

పలాస : ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

మెళియాపుట్టి : మహిళలతో మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధిలో వెనక్కి నెట్టబడ్డామని, భవిష్యత్‌లో అభివృద్ధి, యువతకు భరోసా కల్పించే చంద్రబాబును గెలిపించాలని పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్, చేపల మార్కెట్, మేదరవీధి తదితర ప్రాంతాల్లో టిడిపి ఆధ్వర్యాన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడచిన కాలంలో అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారని, సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.వంద లాక్కున్నారని, ధరలను అదుపు చేయడంలో వైఫల్యం చెందారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ప్రజల భవిష్యత్ బాగుండాలంటే తిరిగి టిడిపి అధికారంలోకి రావాలన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా తనకు, శాసనసభ అభ్యర్థిగా గొండు శంకర్‌కు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో పాటు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో దర్మాపురంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. టిడిపి వల్లే మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రచారంలో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, అసి చిరంజీవులురెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, లీలారాణి, బుద్దాల నిర్మలారెడ్డి, వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని తంగిని, భావనపురం, కాలనీ, సంతోషపురం గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకట్రావు, గోకర్ణపురం సర్పంచ్ ఎస్.రవికుమార్, ఎస్.రాఘవరావు, రమేష్, ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

పలాస: పలాస నియోజకవర్గంలో మంత్రి సీదరి అప్పలరాజు నుంచి వైసిపి దిగువస్థాయి నాయకులు వరకు దోచుకుంటున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ఆరోపించారు. పలాస మండలం పెదంచల, గోదావరి పురం, వీర రామచంద్ర పురం గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, తలగాన నరసింహామూర్తి, సంతోష్‌కుమార్ నాయుడు, దుర్గారావు, పిరికట్ల ధనంజయ, పాపారావు, గుమ్మడి నారాయణ, చక్రదర్, అట్టాడ వాసు పాల్గొన్నారు. అలాగే పలాస రాజులమ్మకాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 270 మంది టిడిపిలోకి చేశారు. వీరికి పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కౌన్సిలర్ త్రివేణి, నవీన్ పాల్గొన్నారు.

కవిటి: సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మళ్లీ గెలిపించాలని ఆయన భార్య నీలోత్పల ఓటర్లను కోరారు. ఈ మేరకు భైరిపురంలో ప్రచారం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడుకు మద్దతుగా పిఎసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి అధ్యక్షతన పూండి, గోవిందపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గోవింద పాపారావు, దున్న షణ్ముఖరావు, అట్టాడ రఘు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి

ఎచ్చెర్ల : పూలే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న డైరెక్టర్ బాలాజీ, సిబ్బంది

రణస్థలం : నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది అని అన్నారు. సమాజంలో ఎన్నో సామాజిక పరమైన ఇబ్బందులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమయంలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, బడుగు జీవుల ఆశాజ్యోతి పూలేని స్మరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, విశ్రాంత సూపరింటిండెంట్ ఇంజినీర్ కె.ఎం.వి.ప్రసాదరావు, జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ డా పెద్దింటి ముకుంధరావు, ఒఎస్‌డి సుధాకర్ బాబు, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, పిఒలు డా వావిలపల్లి సింహాచలం, డా.రాకోటి శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, డిఇఇ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, వలంటీర్లు పాల్గొన్నారు.

రణస్థలం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రం రామతీర్థాలు జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహనికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో సంఘ సంస్కర్త జ్యోతీరావుపూలే, స్వాతంత్ర్య సమరయోధురాలు కస్తూరిభా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురంగి మోహనరావు, ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన మురళీధర్, బరాటం లక్ష్మణరావు, ఎం.ప్రసాదరావు, నక్క శంకరరావు, పొన్నాడ రవికుమార్, కె.పద్మావతి, ఎస్.రాజారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని, యువత వారి ఆశయ సాధనకోసం పోరాడాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న టిడిపి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : సామాజిక వేత్త, సంఘ సంస్కరణ అభిలాషి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు టిడిపి ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మట్ట పురుషోత్తం, బసవల్ల అప్పలస్వామి, కోళ్ల లవ్‌కుమార్, బెహర కాళీ పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గురయ్య, విశ్వనాథం, రాజేష్, సాయి పాల్గొన్నారు. అలాగే సమతా సైనికదళ్ ఆధ్వర్యాన స్థానిక బాలికల వసతిగృహ ఆవరణలో కార్యదర్శి చల్లా రామారావు ఆధ్వర్యాన పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు.

కోటబొమ్మాళి: స్థానిక కమ్యూనిటీ భవనంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రోటరాక్ట్ క్లబ్ మాజీ అధ్యక్షులు నౌగాపు నాగరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. చిగురువలస సూర్యా నారాయణ, కనకరాజు, లక్ష్మి, మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, తెలగవలస మోహనరావు, ఆర్మీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి వాసుదేవరావు

పలాస: సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కీర్తిశేషులు పైల వాసుదేవరావు ఉద్యమ స్ఫూర్తి అందరికీ ఆదర్శమని సిపిఐ యంయల్ న్యూ డెమొక్రసీ జిల్లా సీనియర్ నాయకులు గొరకల బాలకృష్ణ అన్నారు. మండలంలోని బొడ్డపాడులో పైల వాసుదేవరావు వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైలా జీవితమే విప్లవ పోరాటమని, 58 ఏళ్ల రాజకీయ జీవితంలో 48 ఏళ్ల కాలం విప్లవ ఉద్యమంలోనే గడిపారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ విముక్తి కోసం సుదీర్ఘ కాలం పాటు ఎర్ర జెండా వెలుగులో అనేక పోరాటాలను చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, కె.హేమావతి, పుణ్యవతి, గీత, రాపాక మాధవరావు, గర్తం కామేశ్వరరావు, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, రొయ్య సింహాద్రి, భాస్కరరావు, జెడ్డే అప్పయ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పైల వాసుదేవరావు పార్టీని ప్రజాయుద్ధ పంథాలో నడిపారని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని రిట్టపాడులో వాసుదేవరావు 14వ వర్ధంతి సభను ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. పైలా స్మారక స్థూపం వద్ద ఆయన సోదరుడు, పార్టీ సీనియర్ నాయకులు వంకల పాపయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు రామారావు, కార్యదర్శి సోమేశ్వరరావు, రాపాక చంద్రయ్య, పైల అప్పారావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన కార్యవర్గంలో పలువురికి చోటు

ప్రజాశక్తి- కవిటి:

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కవిటికి చెందిన లోల్ల రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ ఎదుగుదలకు, కూటమి సభ్యుల విజయానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. అలాగే తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నాగేంద్రబాబు, మనోహర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నందిగాం : మండలంలోని పాలవలసకు చెందిన కురాకుల యాదవ్, సలాసన షణ్ముఖరావుకు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు వారు తెలిపారు. పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ పదవులు కల్పించడంపై జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కోటబొమ్మాళి: జిల్లా జనసేన పార్టీ కార్యదర్శిగా పల్లి కోటేశ్వరరావును జనసేన పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. జిల్లా కమిటీ నియామకంలో జిల్లా కార్యదర్శిగా కోటబొమ్మాళి మండల నుంచి కోటేశ్వరరావును జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియమించారు.

టెక్కలి : జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూరాకుల యాదవ్‌ని నియమిస్తూ జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఇన్‌ఛార్జి హరిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు, నాగబాబుకు, హరిప్రసాద్‌కు, జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్‌కు అభినందనలు తెలియజేసారు

ఆమదాలవలస: జనసేన జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొర్లకోటకు చెందిన పాత్రుని పాపారావును నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ విడుదల చేసిన శ్రీకాకుళం జిల్లా కార్యవర్గంలో నియమించిన ముగ్గురు ఉపాధ్యక్షుల్లో పాపారావును ఉపాధ్యక్షుడుగా ఎంపిక చేయడం పట్ల మున్సిపాలిటీ, మండలానికి చెందిన పలువురు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పాత్రుని పాపారావు జిల్లాలో పలు ఇంటర్మీడియట్ కళాశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అటువంటి వ్యక్తి రాజకీయాల్లో కూడా రాణించి ఉన్నత పదవులు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

టెక్కలి రూరల్: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా కూరాకుల యాదవ్ నియమించినట్లు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. తనను ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పిసిని చంద్రమోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

యాదవ్

పాపారావు

రాజేష్

జ్వరంతో బాధపడుతున్న కృష్ణవేణి, పారమ్మ

పి.వి పురంలో జ్వరాలు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని ప్రతాప విశ్వనాథపురం గ్రామంలో వారం రోజులుగా పదుల సంఖ్యలో జ్వరాల బారిన పడ్డారు. దీంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని జ్వరపీడితులు బి.మోహనరావు, పి.లచ్చయ్య, కె.వర్షిత, బి.జగన్నాథరావు తెలిపారు. మరి కొంత మంది పలాస, టెక్కలి, హుండీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.అనిత కుమారి ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామంలో రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటి ఆధారంగా గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ సిబ్బంది కాలువల్లో బ్లీచింగ్ జల్లారు.

బహుమతులు అందుకున్న చిన్నారులు

'రవీంద్ర భారతి'లో చిన్నారుల సందడి

టెక్కలి: స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో చదువుతున్న చిన్నారులు గురువారం రంజాన్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయిలో ఉన్న విద్యార్థులు తమ కళా ప్రతిభని చాటుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య గీతికలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో టెక్కలికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ కె.పద్మజ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, డి.నాగరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

టెక్కలి రూరల్ : మండలంలోని టెక్కలి పంచాయతీ పరిధిలో 50 మంది వాలంటర్లు తమ విధులకు రాజీనామా చేస్తూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు అందజేశారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బి.మల్లేశ్వరావుకు రాజీనామా పత్రాలను అందజేస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నకు ముఖ్యమంత్రి చేయాడినికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయకుమార్, మండల సచివాలయం కన్వీనర్ శిగిలిపల్లి మోహనరావు పాల్గొన్నారు.

పాతపట్నం మండలంలోని తెంబూరు పంచాయతీ పరిధిలోని తెంబూరు, పెద్దసరియాపల్లి, పెద్దలక్ష్మీపురాలకు చెందిన 23 మందికి గాను, 20 మంది వాలంటీర్లు సచివాలయ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేశారు.

16న వింధ్యగిరి యాత్ర

కవిటి: ఈనెల 16వ తేదీన వింధ్యగిరి యాత్ర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 15న సాయంత్రం ఏడు గంటలకు కొరారి చండి అమ్మవారి సన్నిధిలో దీపారాధనతో యాత్ర మొదలవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. శిరోముండన (తలనీలాల) యాత్రగా కూడా పిలిచే ఈ జాతరలో అటు ఒడిశా, ఇటు ఆంధ్రా నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం నగరానికి చెందిన కె కె విశ్వేశ్వరరావు రూ.లక్ష విరాళం అంద జేశారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన తన మనవడు అందే సూర్య సుధీర్ కార్తికేయ పేరు మీద చెక్కును ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఆయనను ఆలయ మర్యాదలతో శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు.

ఆపదలో అండగా ఎస్‌జిఎఫ్

కవిటి: ఆపదలో ఉన్నవారికి ఎస్‌జిఎఫ్ సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని సంస్థ సభ్యులు తెలిపారు. మండలంలోని కపాసుకుద్దికు చెందిన భాస్కరరావు గత కొంత కాలంగా చర్మ సంబంధిత కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అతనికి మెరుగైన చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బు అవసరమని గ్రామ యువత ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు ఎస్‌జిఎఫ్ సభ్యులు గ్రామానికి చేరుకున్నారు. భాస్కరరావు కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10,500లు అందించారు. అదేవిధంగా ముత్యాలపేట గ్రామ యువత తమ వంతుగా రూ.7,200లు అందించారు.

ట్రిపుల్ ఐటి ఉద్యోగి రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఎ1 ఆస్పత్రిలో అత్యవసర వైద్యం కోసం చేరిన ఆరు రోజుల చిన్నారికి ట్రిపుల్ ఐటి అధ్యాపకులు టి.వెంకటేష్ ఎస్‌డిపి రక్తాన్ని అందించి ఆదుకున్నారు. మన్యం జిల్లా పాలకొండకు చెందిన విజయలక్ష్మి, పదిహేనేళ్ల నివేదితలకు రక్తంలో ప్లేట్లెట్స్ తగ్గిపోవటంతో అత్యవసరంగా ఏ పాజిటివ్ ప్లేటిలెట్స్ అవసరమయ్యాయి. ప్లేట్ లెట్స్ కోసం రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రాన్ని వైద్యులు, చిన్నారుల కుటుంబ సభ్యులు సంప్రదించారు. వారి అభ్యర్థన మేరకు ట్రిపుల్ ఐటి యోగా అధ్యాపకులు ధనుంజయరావు సూచనతో తోటి అధ్యాపకులు టి వెంకటేష్, నగరానికి చెందిన మహమ్మద్ రఫీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇద్దరి ప్రాణాలను కాపాడారు. లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, సామాజిక సేవకులు ఉర్లం శివతేజ, మదర్స్ లవ్ ఫౌండేషన్ రౌతు సుప్రజ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు చిన్మయరావు, అనంతపల్లి నర్సింగరావు, సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పైడి నాగభూషణరావు గార మండలం కళింగపట్నం, వమ్మరవెల్లిలో గురువారం పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి కూలీలతో ఆయన పని ప్రదేశంలో మాట్లాడారు. పేదల కోసం ఉపాధిహామీ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనని గుర్తు చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు దేశెల్లి గోవింద మల్లి బాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, వామ పక్ష నాయకులు చలపతి పాల్గొన్నారు.